దిద్దుబాటు చర్యలేవి..?

● కొండగట్టు ప్రమాదానికి రేపటితో ఏడేళ్లు

● బస్సు లోయలో పడి 67 మంది మృతి

● ప్రతిపాదనలకే పరిమితమైన నూతన ఘాట్‌రోడ్డు

7

అంగన్‌వాడీల్లో కూరగాయల సాగు..

● చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించడమే లక్ష్యం

● జిల్లాలో 107 కేంద్రాల్లో కిచెన్ గార్డెన్ల ఏర్పాటు

● ఒక్కో కేంద్రానికి రూ.10 వేలు మంజూరు





అంగన్‌వాడీ కేంద్రంలో కూరగాయల విత్తనాలు చల్లుతున్న సిబ్బంది



జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ కేంద్రాల్లో అందించే ఆహారంలో వినియోగించే ఆకుకూరలు, కూరగాయలు అక్కడే పండించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు కిచెన్‌గార్డెన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. తద్వారా అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులు బాలింతలకు నాణ్యమైన పోష కాహారం అందనుంది. జిల్లాలో ఎంపికచేసిన 107అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్‌గార్డెన్ల ఏర్పాటుకు రూ.10వేల చొప్పున నిధులు కేటాయించగా ఆవరణల్లో తోటలు, కుండీల్లో కూరగాయలు, ఆకుకూరలు పెంచనున్నారు. బయట మార్కెట్లపై ఆధార పడకుండా రసాయన ఎరువులు లేకుండా సేంద్రియకూరగాయలు పండించడం ద్వారా ఆహారనాణ్యత పెరుగుతుందని అధికారులు అంటున్నారు. గ్రామీణప్రాంతాల్లో పిల్లలకు పౌష్టికాహార లోపం తీవ్ర సమస్యగా మారింది. ఆయా సెంటర్ల ఆవరణల్లో వంకాయ, బెండ, టమాట, గోంగూర, తోటకూర, పాలకూర వంటివి పెంచుతుండగా పిల్లలకు అవసరమైన విటమిన్లు, మినరల్స్, ప్రోటీన్లు అందించి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడనున్నాయి.

● పిల్లలకు తోటలపై అవగాహన..

కూరగాయలు, ఆకుకూరల తోటల పెంపకంలో అంగన్‌వాడీటీచర్లు, ఆయాలది కీలకపాత్ర ఉంటుం ది. తోటల నిర్వహణలో పిల్లలను కూడా భాగస్వా మ్యం చేయడంద్వారా వారికి వ్యవసాయం, పర్యా వరణంపై అవగాహన కల్పించవచ్చు. కూరగాయలు ఎలా పండుతాయి, వాటిని ఎలా సంరక్షించాలి అనే విషయాలు పిల్లలకు నేరుగా అనుభవం ద్వారా తెలుస్తాయి. ఇది ఒకరకంగా ప్రయోగాత్మక విద్యగా కూడా ఉపయోగపడుతుందని అధికారులు అంటున్నారు.

● నిధుల వినియోగంపై శిక్షణ..

ఒక్కో అంగన్‌వాడీ సెంటర్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10వేలు నిధులు ఎలా వినియోగించాలి, ఏ మొక్కలు నాటాలి, తోటను.....

-మిగతా 8లో

పౌష్టికాహారం అందించేందుకే..

-బోనగిరి నరేశ్, జిల్లా సంక్షేమశాఖ అధికారి



అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించేందుకే సొంతంగా కూరగాయల సాగు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం జిల్లాలో అన్ని సౌకర్యాలు గల 107 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రస్తుతానికి ఎంపిక చేశాం. ఆయా సెంటర్లకు విత్తనాలు ఇప్పటికే పంపిణీ చేయగా నిర్వహణ ఖర్చులు కూడా అందిస్తాం.

ఈదుల లింగంపేట కార్యదర్శి సస్పెన్షన్

జగిత్యాల, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలం ఈదుల లింగంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి పుష్పలతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు డబ్బుల చెల్లింపులో అవకతవకలకు పాల్పడడం, విధుల నిర్లక్ష్యం వహించినందుకు గానూ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే వ్యవహారంలో తప్పుడు సమాచారం అందించినందుకు గానూ ఈదుల లింగంపేట మల్టి పర్పస్ వర్కర్స్ (కారోబార్) రాజేశ్‌ను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి వ్యవసాయ ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించ నున్న దృష్ట్యా మల్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని మల్యాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ దయానంద్ తెలిపారు. ఉదయం 8.30గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధుల సంక్షేమానికి కమిషన్ ఏర్పాటు చేయాలి

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని జిల్లా సీనియర్ సిటిజన్ల సంఘం అధ్యక్షుడు హరిఅశోక్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక కమిషన్ వేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, కోశాధికారి ప్రకాశ్‌రావు, ఉపాధ్యక్షులు పిసి హన్మంత్ రెడ్డి, డిడింగాల విఠల్, అశోక్ రావు, పబ్బా శివానందం, గంగం జలజ, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ

సారంగాపూర్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి) : సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా నోడల్ అధికారిబి, నారాయణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భగా కళాశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ బాబు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

బీర్‌పూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలుసుకున్న స్నేహితులు మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. బీర్‌పూర్ మండలకేంద్రానికి చెందిన పూడూరి నరేష్ అనే యువకుడు వినాయకుల నిమజ్జనం రోజున రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. కార్యక్రమంలో పూడూరి రవి, పూడూరి సతీష్, మృతుడి స్నేహితులు ఉన్నారు.

ఆలయ భూములకు హద్దులు నిర్ణయించాలి

కొడిమ్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ లక్ష్మీ నర్సింహ స్వామి, కొడిమ్యాల శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, నమిలికొండ దేవాలయంకు ఉన్న భూములకు హద్దులు నిర్ణయించాలని సోమవారం ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ఎండోమెంట్ అధికారి సుప్రియకు వినతిపత్రాన్ని అందించినట్లు ఆర్‌టీఐ జిల్లా అధ్యక్షుడు, బీజేపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు అక్కపెల్లి రవీందర్ మంగళవారం తెలిపారు. ఆలయ భూములకు హద్దులు లేకపోవటంతో అవి ఆక్రమణకు గురవు తున్నాయన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో అనర్హులకు చోటు

● మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు పలువురు టీచర్ల ఫిర్యాదు

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో పలువురు అనర్హులకు చోటు కల్పించారని ఆరోపిస్తూ కొంతమంది టీచర్లు ఇటీవల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో హిందీ ఉపాధ్యాయులకు చోటు కల్పించలేదని ఆరోపించారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యా యులుగా వివిధ మండలాల్లో పనిచేస్తున్న 61 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఇటీవల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా అవార్డుల పంపిణీ, సన్మానం నిర్వహించారు. అయితే ఎంపిక బాధ్యతలను మండల విద్యాధికారులకు జిల్లా విద్యాధికారి అప్పగించారు. అర్హులకు పలువురికి చోటు దక్కలేదని, ఎంపికలో ఎంఈఓలు నిబంధనలు, మార్గదర్శకాలను తుంగలో తొక్కారన్న విమర్శలు విద్యాశాఖ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

● ఆర్‌యూపీపీ ప్రతినిధుల అసంతృప్తి

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులలో భాషోపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) ప్రతినిధులు ఇటీవల మంత్రి లక్ష్మణ్ కుమార్‌తో పాటు డీఈవో రాముకు ఫిర్యాదు అందించారు. తెలుగు సబ్జెకు బోధించే ఉపాధ్యాయునికి ఒక్కరికి మాత్రమే జాబితాలో చోటు కల్పించారని, హిందీ ఉపాధ్యాయులకు ఒక్కరికి సైతం ఇవ్వలేదని నిరసన వ్యక్తం చేస్తూ వినతిపత్రం ఇచ్చారు. అయితే జిల్లాలో ఇటీవల జరిగిన పదోన్నతులలో భాషా పండితులకు దాదాపు అందరికీ పదోన్నతి దక్కింది. దీంతో స్కూల్ అసిస్టెంట్‌లకు చోటు కల్పించామని, ప్రత్యేకంగా భాషా పండితులను ఎంపిక చేయలేదని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి. జిల్లా స్థాయిలో 61 మందికి అవార్డులు ప్రకటించగా, అందులో గణితం సబ్జెకు టీచర్లకు 4, ఇంగ్లీష్ 8, ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 3, తెలుగు 1, ఇతరులకు 42 మందికి ఇచ్చారని, భాషా పండితులకు ఇవ్వలేదని సంబంధిత ఉపాధ్యాయులు వాదిస్తున్నారు.

● ఆరోపణల వెల్లువ..

ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయడంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఎంఈఓలు పలు మండలాల్లో ఉన్నతాధికారుల మార్గదర్శకాలు, నిబంధనలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు చోటుచేసుకున్నాయి. మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, ధర్మపురి మండలాలకు చెందిన ముగ్గురు ప్రధానోపాధ్యాయులు ఇటీవల బదిలీల్లో తప్పుడు సమాచారం అందించి లబ్ధి పొందారన్న ఫిర్యాదులున్నాయి. సంబంధిత ఫిర్యాదుపై షోకాజు నోటీసులు జారీ చేసి విద్యాశాఖ విచారణ జరుపుతోంది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయులను సైతం అవార్డులకు ఎంపిక చేశారని ఉపాధ్యాయ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. జిల్లా విద్యాశాఖ కార్యాలయం నుంచి జారీ చేసిన మార్గదర్శకాల్లో ప్రతీ మండలం నుంచి ముగ్గురు చొప్పున ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని పేర్కొన్నప్పటికీ పలు మండలాల్లో పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. జగిత్యాల నియోజకవర్గంలోని ఓ మండలానికి చెందిన ఉపాధ్యాయురాలు ఎలాంటి దరఖాస్తు చేసుకోనప్పటికీ ఎంపిక చేశారని, కనీసం రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకోని ఉపాధ్యాయులను ఎంపిక చేశారనే ఆరోపణలున్నాయి. ఓ మండల విద్యాధికారి తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంబంధిత మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు ఫిర్యాదు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక వివాదాస్పదం కావడం జిల్లా విద్యాశాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాల్ వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై మరియు కీటక జనన వ్యాధుల నివారణ పై తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజల్లో అవగాహన కల్పించాలని, ఇంటింటా జ్వరం సర్వేలు, డ్రైడే నిర్వహించాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుందని, డ్రై డే కార్యక్రమంలో భాగంగా నీటి నిలువ ఉన్న పాత్రలను



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

పారబోసి స్టాగ్నెట్ అయిన వాటర్‌లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. ప్రమోద్ కుమార్, ఉపవైద్యాధికారి డాక్టర్ నీలారపు శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్ రెడ్డి, డాక్టర్ అర్చన, డిపిఓ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

జగిత్యాలరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవతంగా పూర్తి చేయాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం లోని వెల్దుర్తి , కండ్లపల్లి గ్రామాల్లో కలెక్టర్ సోమవారం పర్యటించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. అనంతరం కండ్లపల్లి మోడల్ స్కూల్ లో చేపడుతున్న కిచెన్ షెడ్ నిర్మాణ పనులు పరిశీలించారు. నాణ్యతగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఇంజనీరింగ్ పంచాయితీ అధికారి లక్ష్మణ్‌రావు, ఆర్డీవో మధుసూధన్, ఎంపీడీఓ రమాదేవి, తహసీల్దార్ వరందన్ పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఏవో భాస్కర్

కొడిమ్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు పత్తి సాగులో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని పూడూర్ రైతు వేదికలో కరీంనగర్ రైతు విజ్ఞానకేంద్రం కో ఆర్డినేటర్ హరికృష్ణ అధ్యక్షతన వ్యవసాయ శాఖ సహకారంతో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులు నానో యూరియా వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ ప్రధాన శాస్త్రవేత్త రాంప్రసాద్ మాట్లాడుతూ పత్తి సాగు విధానంలో మెళకువలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో పి. జ్యోతి, ఏఈవో రాజేష్, మాజీ సర్పంచు రాంరెడ్డి, లోహ్యా ఆయిల్ సీడ్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

'క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుంది'

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జగిత్యాల అర్బన్ ఎంఈవో చంద్రకళ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జగిత్యాల అర్బన్ మండల బాల, బాలికలు అండర్ 14, 17 కబడ్డీ, కోకో, వాలీబాల్ సెలక్షన్స్‌కు మంగళవారం పట్టణంలోని స్థానిక వివేకానంద మినీస్టేడియంలో క్రీడా పోటీల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. అర్బన్ మండలం నుంచి 500మంది క్రీడాకారులు ఈ ఎంపికలో పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన వారిని జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని క్రీడల కన్వీనర్ శ్రీనివాస్ తెలిపారు.

●**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండల ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలు పొలాస ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఎంఈఓ గంగాధర్, పొలాస మాజీ సర్పంచ్ గాజంగి భారతినందయ్యలు హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజమౌళి, గంగనర్సయ్య పాల్గొన్నారు.

●**కోరుట్ల రూరల్:** పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం మండల స్థాయి అండర్ 14, అండర్ 17 విద్యార్థులకు ఖోఖో, కబ్బడీ, వాలిబాల్, అథ్లెటిక్స్ పోటీలను ఎంఈవో నరేశంతో కలిసి ఎంపీడీఓ రామకృష్ణ ప్రారంభించారు.

●**మల్యాల:** మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో క్రీడా పోటీలను ఎంఈవో ఎస్.జయసింహారావు ప్రారంభించారు. బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ మానస పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ఎంఈవో ప్రభాకర్ ప్రారంభించారు. అండర్ 14, అండర్ 17 విభాగాలలో బాల బాలికలకు వేరు వేరుగా పోటీలు నిర్వహించారు. కబడ్డీలో అండర్ 14 విభాగంలో పూజ, సంజన, నిహారిక, చంద్రలేఖ, అండర్ 17 విభాగంలో నిషిత, సైనిక, కీర్తి, సాగ్నవి ఎంపికయ్యారు. ఖో ఖో అండర్ 14 విభాగంలో వినీల, వైష్ణవి, సంకీర్తన, లాస్య, అండర్ 17 విభాగంలో హరిణి, లావణ్య, వైష్ణవి ఎంపికయ్యారు.

●**రాయికల్:** భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్రీడలను తహసీల్దార్ నాగార్జున ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఎంఈవో రాఘవులు, ఎంపీవో సుష్మా, ప్రధానోపాధ్యాయులు యామీ రమణి, ఎస్‌జీఎఫ్ కన్వీనర్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

●**గొల్లపల్లి:** చిల్వాకోడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి క్రీడాపోటీలను ఎంఈవో చెరుకు రాజన్న ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీబాయి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సంగనభట్ల ప్రశాంతి, ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళోజీ రచనలు తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం

-కలెక్టర్ సత్య ప్రసాద్



కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ రచనలు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించాయని కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన్‌లో మంగళవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి, తెలంగాణా భాషా దినోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్ర పటానికి కలెక్టర్ నివాళులు అర్పించి మాట్లాడారు. తెలుగు భాషపై అమితమైన ప్రేమను కలిగినటువంటి కాళోజీ ఆశయాలను కొనసాగించాలని కోరారు. బీసీ వెల్ఫేర్ అధికారిణి సునీత, డీఆర్‌డీవో రఘు వరన్, డీపీవో మదన్ మోహన్ తదితరులు ఉన్నారు. అలాగే కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం ఈధ్వర్యంలో కాళోజీ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డేన్‌లో ఘనంగా నిర్వహించారు. కళాశ్రీ అధినేత గుండేటి రాజు, ప్రముఖ కవులు అయిత అనిత, శ్రీలక్ష్మి, లావణ్య కమల, రమాదేవిలు పాల్గొని కాళోజి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, శ్యాం సుందర్, సవిత, గంగాధర్ తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

-ఎస్పీ అశోక్ కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మెగా లోక్ అదాలత్‌ను సద్వి నియోగం చేసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కోర్టులో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంపై పోలీస్ అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిన్న, చిన్న రాజీ పడే కేసులను కక్షిదారులు లోక్ ఆదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. రాజీ మార్గం రాజ మార్గమని చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బులను వృధా చేసుకోవద్దన్నారు. జ్యూడిషియల్ డిపార్టుమెంట్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్టు విధులు నిర్వహించే పోలీస్ అధికారులు రాజీపడ్డ దగ్గ కేసులను గుర్తించి ఇరువర్గాల వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. లోక్ అదాలత్ ద్వార సత్వర న్యాయం జరుగుతుందన్నారు.

యూరియా కోసం రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

రాయికల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలో యూరియా కోసం రైతులకు తిప్పడం తప్పడం లేదు. రాయికల్ మండలంలోని అయోధ్య గ్రామంలో మంగళవారం రైతులకు సరిపడా యూరియా అందడం లేదని రాస్తారోకో చేశారు. రాయికల్ ఎస్సై సుధీర్ రావు సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడి యూరియాను సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళనను విరమించారు.

యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి

● డీఏవోకు వినతి

కొడిమ్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని మండలంలోని పూడూర్ రైతు వేదిక వద్ద మంగళవారం జిల్లా వ్యవసాయా అధికారి వి. భాస్కర్, ఏవో జ్యోతిలకు కొడిమ్యాల రైతు ఐక్య వేదిక నాయకుడు ఏలేటి నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రైతు వేదిక నాయకులు మాట్లాడుతూ యూరియా సరఫరా సరిగాలేని కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటపై సరైన సమయంలో యూరియాను వినియోగించక పోయినట్లయితె పంట దిగుబడులు తగ్గుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందించిన వారిలో నాయకులు చంద్రమోహన్, సాగర్‌రావు, తిరుపతిరెడ్డి, వెంకన్న అఖిల్ తదితరులు ఉన్నారు.

తల్లి మందలించిందని విద్యార్థిని ఆత్మహత్య


మధుమతి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని మనస్థాపం చెందిన పదో తరగతి విద్యార్థిని లకావత్ మధుమతి(16) ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎస్ఐ రాహుల్‌రెడ్డి, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వీర్నపల్లి మండలం రంగంపేటకు చెందిన లకావత్ లలిత-ఫరంగి దంపతులకు ఒక్కగానొక్క కూతురు మధుమతి. ఈ కుటుంబం ఐదేళ్ల క్రితం ఉపాధి కోసం ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి వచ్చారు. కూతురు మధుమతి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తరచూ బడికి వెళ్లకపోవడంతో ఈ నెల 1న తల్లి లలిత కూతురు మధుమతిని మందలించింది. మనస్థాపం చెందిన విద్యార్థిని ఇంటిలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయింది. గమనించిన కుటుంబీకులు ఆమెను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారం రోజుల పాటు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయింది. మృతురాలు తల్లి లలిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.


అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

సైదాపూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామానికి చెందిన బోయిని సత్యనారాణ స్వామి(42) అనే వ్యక్తి అనారోగ్యం భరించలేక ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు సత్యనారాయణ స్వామి భార్య రేణుక, అతని పెద్ద కుమారుడు మణిసాయి వారం రోజుల క్రితం ఊరు వెళ్లారు. సత్యనారాణ స్వామి తన చిన్న కుమారుడు సాయితేజ ఇంట్లో ఉంటున్నారు. సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో సాయితేజ కిరాణ షాపునకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో సత్యనారాణ స్వామి దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నకుమారుడు సాయితేజ వచ్చి చూసేసరికి సత్యనారాణస్వామి దూలానికి వేలాడుతూ కనిపించాడు. తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడని మృతుడి పెద్ద కుమారుడు మణిసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఆరోగ్యం సహకరించడం లేదని ఆత్మహత్య


దేవయ్య(ఫైల్)

కోనరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యం సహకరిం చడం లేదని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుద్దాల గ్రామానికి చెందిన అలువాల దేవయ్య(57) చాకలి వృత్తితోపాటు బ్యాండ్ వాయించడం, డీజే నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రెండుసార్లు యాక్సిడెంట్ కావడంతో కాలు విరిగింది. ఆరోగ్యం సహకరించకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది సోమవారం రాత్రి పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఏడు గంటలకు వరకు కూడా రాకపోవడంతో ఆ ప్రాంతాన్ని కుటుంబ సభ్యులు రాత్రంతా వెతికారు. పొలం వద్ద ఉన్న ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించి పోలీసులకు సమా చారం అందించారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఒక్క క్షణం..

ఆలోచిస్తే నిలుస్తుంది ప్రాణం

- మనోధైర్యం కోల్పోవద్దు..
- చావే సమస్యకు పరిష్కారం కాదు
- చిన్న వయస్సు నుంచే ఓటమిని తట్టుకోవడం నేర్పాలి
- నేడు ఆత్మహత్య నివారణ దినం



కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మవిశ్వాసంతో, మనోధైర్యం కోల్పోకుండా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ ఉండదు. చావే సమస్యకు పరిష్కారం కాదు... ఆధునిక కాలంతోపాటు పరుగులు తీస్తూ ప్రకృతిని శాసించే స్థాయిలో సాంకేతికంగా ఎంతో పురోమిస్తున్న సందర్భంలో ఎన్నో అవకాశాలు, వసతులు, సౌకర్యవంతమైన జీవన విధానాలు అందుబాటులోకి వచ్చాయి.

ఇదే సమయంలో ఆర్థికపరమైన ఇబ్బందులు, ఒత్తిడితో కూడిన చదువులు, ఉద్యోగాలు, ప్రేమ విఫలం, కు టుంబ కలహాలు వంటి కారణాలతో రోజు రోజుకు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. చిన్నపాటి సమస్యలను కూడా తనకుతానుగా పరిష్కరించుకోలేని పరిస్థితుల్లో నేటి యువత ఉంది. మన పూర్వీకులు లక్షలు, కోట్ల రూపాయలు, ఆస్తులు లేకున్నా ఆనందమయ జీవితాలను గడిపారు. దీనికి ప్రధాన కారణం వారసత్వంగా వచ్చిన జీవననైపుణ్యాలతో వారిలో బతకగలుగుతామనే మనో ధైర్యం ఉండేది. కాని నేటి తరంలో అవి కొరవడుతున్నాయి. క్రమశిక్షణ కొరవడం, విచక్షణలేమి వంటివి మానసికంగా దెబ్బతీస్తున్నాయి. చిన్న వయస్సు నుంచే పిల్లలకు ఓటమి, ఒత్తిడిని తట్టుకునేలా తల్లిదండ్రులు నేర్పించాలి. చిన్న చిన్న సమస్యలు వచ్చిన సమయాల్లో వారే పరిష్కరించుకునేలా పరిస్థితులను కల్పించాలి.

సమస్య వచ్చినప్పుడు దిగులు చెందితే పరిష్కారం దొరకదు. సమస్య నుంచి బయట పడడానికి, కనీసం సమస్య తీవ్రతను తగ్గించుకోవడానికి ఆలోచించాలి. ఓటమిని పాఠంగా నేర్చుకుని విజయానికి అది మెట్టుగా సరిదిద్దుకోవాలి. ప్రతి వ్యక్తి జీవితంలో ఏదో ఒక విషయంలో సర్దుబాటు అనేది తప్పనిసరి. ప్రతిది మనం అనుకున్నట్లే జరగాలనుకుంటే సాధ్యమయ్యే పనికాదు.

ఉమ్మడి కుటుంబాలు మాయం..

నేటి ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి. ఆత్మహత్యలకు ఇదీ ఒక కారణమని మానసిక, సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఉమ్మడి కుటుంబాల్లో సమస్యలు వచ్చిన సందర్భంలో అందరు కుటుంబ సభ్యులు ఒక చోట కూర్చుండి సమస్యపై చర్చించుకుని, పరిష్కరించుకునేవారు. ఒకరి బాధను మరొకరు పంచుకునేవారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవటంతో భార్యాభర్తల మధ్య విభేదాలు, భేదాభిప్రాయాలు తలెత్తిన సందర్భంలో వారికి సర్ది చెప్పి, వారి సంసారం సజావుగా సాగిపోయేలా నిర్ణయాలు తీసుకునే కుటుంబ పెద్దలు లేకుండా పోయారు. మరో వైపు భార్యభర్తలు ఇరువురు ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ ఇరువురు సంపాదిస్తుండటంతో సమానమనే భావనతో ఇగోలు పెరిగిపోవటంతో తరచుగా దంపతుల్లో విభేదాలు తలెత్తుతున్నాయి. ఇటువంటివి మొగ్గలోనే తుంచే పెద్ద మనిషి అందుబాటులో ఉండడం లేదు. మరో వైపు యువ దంపతులు వివా హం కాగానే ఉద్యోగరీత్యా, పిల్లల చదువురీత్యా, ఇతర త్రా పట్టణాలలో కాపురాలు పెడుతున్నారు. ఇటువం టి సమయాల్లో వారి మధ్య తలెత్తిన చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే కుటుంబ వ్యవ స్థ లేకుండా పోయింది. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవటంతో కట్టుబాట్లు, ఆచరణ పద్దతులు, సంప్రదాయాలు కొంత వరకు కనుమరుగవుతున్నాయి.

ఏడాదిన్నరలో 494 మంది ఆత్మహత్య

కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్‌లో గడిచిన ఏడాదిన్నర సమయంలో 494 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. కుటుంబ సమస్యలు, ఆర్థికపరమైన ఇబ్బందులు, భార్యభర్తల మధ్య తగువులు, మానసిక, ఆరోగ్య సమస్యలతో పురుగుల మందుతాగి, ఉరివేసుకుని, బావుల్లో, చెరువుల్లో దూకి బలవన్మరణాలకు పాల్పడ్డారు. 2024 సంవత్సరంలో 288 మంది, 2025 సంవత్సరం సెప్టెంబరు 9 వరకు 206 మంది ఆత్మహత్య చేసుకున్నారు.

నేపథ్యం

ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని 2003 లో అంతర్జాతీయ ఆత్మహత్య నివారణ సంఘం, ప్రపంచ ఆరోగ్య సంస్థతో కలిసి ఏర్పాటు చేసింది. ప్రతి ఏడాది సెప్టెంబరు 10వ తేదీన ఆత్మహత్యలపై దృష్టిని కేంద్రీకరించడం, కళం కాన్నితగ్గించడంపై దృష్టి పెట్టారు.



సమస్యకు చావే పరిష్కారం కాదు....

ఎ నిరంజన్‌రెడ్డి, కరీంనగర్ రూరల్ సీఐ



ఎంతటి సమస్యకైనా చావే పరిష్కారం కాదని గ్రహించాలి. ఏదైనా సమస్య వచ్చిన సందర్భంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులతో చెప్పుకుంటే మనసులో ఉన్న బాధ కొంతవరకు తొలగిపోయి సమస్య పరిష్కారానికి మార్గం లభిస్తుంది. సమస్య ఎదురైనప్పుడు అధైర్యపడొద్దు. ఆ సమస్యలను ఏ విధంగా పరిష్కరించుకోవాలి, అధిగమించాలనేది కొద్ది సేపు ఆలోచిస్తే ఆత్మహత్య నిర్ణయం నుంచి బయటపడుతారు.

క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితంపై ప్రభావం

డాక్టర్ వర్షి, మానసిక వైద్య నిపుణుడు



క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు వారి జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ఆత్మహత్యలకు పురిగొల్పుతాయి. ఇలాంటి నిర్ణయాలు జీవితాలను చిదిమేస్తాయి. జీవితంపై సరైన అవగాహన, ధృక్పథం లేకపోవడం వల్ల ఆత్మహత్య ఆలోచనలు మదిని తొలగిచివేస్తాయి. జీవితంలో తిరిగి పొందలేనివి రెండే. ఒకటి కాలం, మరొకటి ప్రాణం. వీటిని తిరిగిపొందలేమనే నిజాన్ని తెలుసుకోవాలి.

బస్సు ఆపలేదని డ్రైవర్‌పై దాడి

వేములవాడ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఆపలేదని డ్రైవర్‌పై ఓ వ్యక్తి దాడికి దిగాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ నుంచి మర్రిమడ్ల వెళ్లే ఆర్టీసీ బస్సు పట్టణంలోని కోరుట్ల బస్టాండుకు వచ్చింది. దీంతో బస్సు ఎక్కేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించగా బస్సు ముందుకు కదలడంతో డ్రైవర్‌కు, సదరు వ్యక్తికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో డ్రైవర్‌పై అతను దాడి చేయడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు తెలిపారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై వాట్సాప్ గ్రూప్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకుడు మహేందర్ ఆధ్వర్యంలోని నాయకులు మంగళవారం ఎల్లారెడ్డిపేట పోలీసుకు ఫిర్యా దు చేశారు. నాయకులు సంతోష్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, ఇలియాస్ ఉన్నారు.

ముగ్గురు వ్యక్తులపై కేసు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు చదును చేసిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన గెంటె శ్రీనివాస్, గెంటె తిరుపతి, గెంటె లక్ష్మీలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్ రెడ్డి మంగళవారం రాత్రి పేర్కొన్నారు. తహసీల్దార్ సుజాత ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మట్టి తరలిస్తున్న ఇద్దరిపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ లక్ష్మణ్ మంగళవారం రాత్రి తెలిపారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. వీర్నపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, యజమానులపై కేసు నమోదు చేశామని చెప్పారు.

జమ్మికుంట మండలంలో..

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 09 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామానికి చెందిన కొత్త ఎల్లారెడ్డి భూమిలో గత నెల 15న అదె గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి, గణపతిరెడ్డిలు అక్రమంగా దున్నుతుండగా ఎల్లారెడ్డి అడ్డుపడ్డాడు. భూమిలోకి వస్తే చంపేస్తామని వారు బెదిరించారని వచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

అప్పుల బాధతో కండక్టర్ ఆత్మహత్య


లక్ష్మీనారాయణ (ఫైల్)

కథలాపూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన పల్లికొండ లక్ష్మీ నారాయణ (54) అనే ఆర్టీసీ కండక్టర్ అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం లక్ష్మీనారాయణ కోరుట్ల డిపోలో కండక్టర్‌గా పనిచేస్తుండగా విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నాడనే అభియోగంతో ఏడాది క్రితం సస్పెండ్ చేశారు. దీంతో మద్యానికి బానిసై అప్పుల భారం పెరిగింది. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన లక్ష్మీనారాయణ గ్రామ శివారులోని మర్రిచెట్టుకు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన వివాహిత ఈరవేణి రమ్య(35) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు. భార్య మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆమె భర్త కృష్ణ దుబాయి నుంచి బయలుదేరాడు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

లారీ డ్రైవర్ ఆత్మహత్య

తంగళ్లపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేటకు చెందిన వాడెపు జంగయ్య(45) మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న జంగయ్య మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. మంగళవారం తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపారు.

ఇసుక రవాణా చేస్తున్న లారీ, టిప్పర్ పట్టివేత

తంగళ్లపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీతో పాటు టిప్పరును పట్టుకున్నట్లు ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున తంగళ్లపల్లి గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీ, టిప్పర్లు పట్టుబడ్డాయి. లారీ, టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీ, టిప్పర్ల డ్రైవర్లతో పాటు యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం మత్తులో విధులకు..

- ఫోన్‌లో అశ్లీల వీడియోలు
- ఆసుపత్రిలో లైంగిక దాడి నిందితుడి అరెస్టు

ఎప్పుడూ మద్యం సేవించి ఆస్పత్రికి వచ్చేవాడు. తాగనిదే డ్యూటీలోకి వెళ్లడు.. అతని వ్యవహార శైలిని గమనించిన రెండు ఆస్పత్రులు ఉద్యోగం నుంచి తప్పించాయి.. కొన్నాళ్లు స్వగ్రామా నికి వెళ్లిన అతడు తిరిగి వచ్చి మళ్లీ ఓ ఆస్పత్రిలో చేరాడు. ఈ నెల 6న మద్యం సేవించి ఆసుపత్రికి వచ్చాడు. ఎమర్జెన్సీలో డ్యూటీ వేయించుకుని 7న తెల్లవారు జామున ఓ యువతికి మత్తు మందు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసు కమిషనర్ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న యువతిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కమిషనరేట్ కేంద్రంలో పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జ్వరంతో బాధపడుతున్న యువతిని ఆమె తల్లిదండ్రులు ఈ నెల 6న కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అదే ఆసుపత్రిలో కాంపౌండర్/ఓటీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న మహారాష్ట్రకు చెందిన పెద్ది దక్షన్‌మూర్తి అలియాస్ దక్షిణామూర్తి (23) ఆసుపత్రిలో రాత్రి విధుల్లో ఉన్నాడు. 7న వేకువజామున బాధితురాలికి మత్తుమందు ఇంజక్షన్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత యువతికి మెలకువ వచ్చిన అనంతరం జరిగిన విషయాన్ని తన తండ్రికి చెప్పడంతో, అతను కరీంనగర్ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు క్రైమ్ నంబర్ 343/2025 అండర్ సెక్షన్ 64(2)(ఇ) బీఎన్‌ఎస్-2023 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఆసుపత్రికి వెళ్లి సాక్షులను విచారించారు. ఆధారాలను సేకరించారు. ఆధారాలన్నీ పరిశీలించిన తరువాత, సెప్టెంబర్ 8న పోలీసులు నిందితుడు పెద్ది దక్షన్‌మూర్తి అలియాస్ దక్షిణామూర్తిని అరెస్ట్ చేశారు.

● నిందితుడి నేపథ్యం...

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా, సిరొంచ తాలూకా, లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందినపెద్ది దక్షన్‌మూర్తి అలియాస్ దక్షిణామూర్తి ఇంటర్ వరకు చదువుకుని, నాలుగు సంవత్సరాల క్రితం కరీంనగర్ వచ్చాడు. ప్రస్తుతం ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్నాడు. మొదట కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో వార్డు బాయ్‌గా పని చేసి, మరో ఆసుపత్రిలో మేల్ నర్సుగా చేరాడు. తరచూ మద్యం సేవించి డ్యూటీకి రావడం వల్ల ఆసుపత్రి యాజమాన్యం అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. అనంతరం స్వగ్రామానికి వెళ్లి తిరిగి కరీంనగర్ వచ్చి ఈ ఆసుపత్రిలో మేల్ కాంపౌండర్‌గా చేరాడు. నిందితుడు తరచూ అశ్లీల వీడియోలు చూస్తూ, మద్యం సేవించి విధులకు హాజరయ్యేవాడు అని సీపీ తెలిపారు. లైంగికదాడి జరిగిన రోజు మద్యం సేవించి ఆసుపత్రి విధులకు హాజరైన నిందితుడు దక్షన్‌మూర్తి వేకువజామున యువతికి మత్తు మందు ఇంజక్షన్ ఇచ్చి లైంగిక దాడికి పాల్పడిన సాక్ష్యాలను సీసీ కెమెరాద్వారా పోలీసులు సేకరించారు. మద్యం కొనుగోలు చేయటం, ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించిన ఫోన్‌ను, మద్యం దుకాణం వద్ద సీసీ పుటేజీలతో పాటు మత్తుమందు ఇచ్చిన ఇంజక్షన్, బెడ్‌షీట్, ఇతర అన్ని సాక్ష్యాధారాలను పోలీసులు సేకరించారు. నిందితుడి ఫోన్‌లో పోర్న్ వీడియోలను గుర్తించారు.

● ఆసుపత్రులు భద్రత కల్పించాలి

దర్యాప్తులో ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం వహించినట్లు తేలితే కలెక్టర్, సంబంధిత అధికారులకు నివేదిక పంపి తగు చర్యలు తీసుకుంటామని పోలీస్‌కమిషనర్ తెలిపారు. కరీంనగర్‌లో 450 వరకు ప్రైవేట్ ఆసుపత్రులున్నాయని, ప్రజలు నమ్మకంతో ఆసుపత్రుకలు వస్తుంటారని, వీరికి భద్రత కల్పించటం ఆసుపత్రి నిర్వాహకుల బాధ్యత అని అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అన్నిరకాల భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఆసుపత్రుల్లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది పూర్తి వివరాలు, వారి ప్రవర్తన గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ విషయంపై త్వరలోనే కలెక్టర్ అనుమతితో కో ఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.

● యువత వ్యసనాలకు బానిస కావొద్దు

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలు కావద్దని సీపీ సూచించారు. ఈ కేసులో నిందితుడు చెడు అలవాట్లకు బానిసై, పోర్న్ వీడియోలు చూస్తూ ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడన్నారు. తన జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డాడని తెలిపారు. యువత కెరీర్‌పై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో కరీంన గర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, మూడో రాణా సీఐ జాన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య


గోపగోని బాబు(ఫైల్)

తిమ్మాపూర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ నుంచి ట్రాక్టర్ లోన్, ఇంటి లోన్లు తీసుకొని కట్టలేదని ఫైనాన్స్ వారి వేధింపులతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ సంఘటన తిమ్మాపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. తిమ్మాపూర్‌కు చెందిన గోపగోని బాబు(43) గ్రామంలో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటున్నాడు. ఇతడికి భార్య పద్మ, ఇద్దరు కుతూళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. బాబు వ్యవసాయ పనుల నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఫైనాన్స్‌లో 2.80 లక్షల రూపాయలతో ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఫైనాన్స్ కంపెనీకి రెండు వాయిదాలు చెల్లించలేదు. దీంతో కంపెనీ ప్రతినిధులు ఫోన్‌లో బెదిరించడంతో పాటు వాయిదాలు చెల్లించకపోవడంతో ట్రాక్టర్‌ను కూడా తీసుకెళ్లారు. అదే విధంగా ఇంటిని మార్టిగేజ్ చేసి 7లక్షల 70వేల రూపాయల హోమ్ లోన్ బాబు తీసుకున్నాడు. ఇంటికి తీసుకున్న లోన్ ఒక వాయిదా కూడా చెల్లించకపోవడంతో పాటు బాబు వేరే అప్పులు కూడా చేసి ఆర్థికంగా ఇబ్బందిపడ్డాడు. ఒక నెల సమయం ఇస్తే రెండు ఫైనాన్స్‌లకు సంబంధించిన బాకాయిలను చెల్లిస్తానని హామీ ఇచ్చిన బాబు ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై ఈ నెల 6వ తేదీన పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి కొద్ది సేపటికి గడ్డి మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు బాబును కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాబు మంగళవారం ఉదయం మృతి చెందాడు. బాబు భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

లారీని ఢీకొట్టిన గూడ్స్ వాహనం

- పేలిన ఆక్సిజన్ సిలిండర్లు
- ముగ్గురికి గాయాలు


దగ్ధమవుతున్న వాహనం


క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

బచ్చన్నపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై ఆలీంపూర్- వీఎస్ఆర్ నగర్ టోల్‌గేట్ మధ్య ఆగివున్న లారీని, అశోక లేలాండ్ గూడ్స్ వాహనం ఢీకొని దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరుకు చెందిన బొమ్మడవేణి శ్రీనివాస్, కొత్తూరు శ్రీను, తిప్పట్ల శ్రీనివాసులు రాజమండ్రి నుంచి చేప పిలల్లను సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామ చెరువులో వేసేందుకు తీసుకొస్తున్నారు. చేప పిల్లల రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న ఆక్సీజన్ సిలండర్‌లు పేలడంతో మంటలు వ్యాపించి గూడ్స్ వాహనం దగ్ధమైంది. ప్రమాదం జరగగానే రైతులు వాహనంలో ఇరుక్కున్న ముగ్గురిని బయటకు తీశారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ అబ్దుల్ హమీద్ ఘటనాస్థలికి చేరుకుని, క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రూ. 9.50 లక్షల వాహనం దగ్ధం కాగా, రూ. 1.50 లక్షల చేపపిల్లలు చనిపోయాయని తెలిపారు. బొమ్మడవేణి శ్రీనివాస్ బావమరిది పెసరు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కారు - ఆర్టీసీ బస్సు ఢీ : ఒకరి పరిస్థితి విషమం


ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు

ధర్మారం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మారం మండల కేంద్రంలో మంగళవారం కారు, ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన దూపం శివప్రసాద్ (28) కారులో పెద్దపల్లికి వెళ్తున్నాడు. ధర్మారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న ఆటోను తప్పించే క్రమంలో కరీంనగర్ నుండి మంచిర్యాలకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కారుఢీకొట్టడంతో శివప్రసాద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారు బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రమాదతీవ్రత తగ్గింది. కారులో ఉన్న క్షతగాత్రుడిని స్థానికులు కారు అద్దాలు పగుల గొట్టి బయటకు తీశారు. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో హుటాహుటిన కరీంనగర్‌లోని అపోలో హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. యాక్సిడెంట్‌తో కారు అద్దాలు, ఆటోలోని కూల్‌డ్రింక్స్‌తో రోడ్డంతా చిందర వందరగా మారింది. ఒక్క సారిగా ఏం జరిగిందో తెలియక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. యాక్సిడెంట్ వల్ల బస్సు - కారు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆదేశంతో హెడ్ కానిస్టేబుల్ భూమయ్య, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఎక్స్‌కావేటర్ సాయంతో కారును పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

అసైన్డ్ భూమి కోసం ఇరువర్గాల ఆందోళన

ముస్తాబాద్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావ్‌పల్లె గ్రామంలో గ్రామస్థులకు, ఓ వర్గానికి మధ్య ఏళ్ల తరబడి ఘర్షణ జరుగుతోంది. గ్రామ పరిధిలోని అసైన్డ్ భూమిని ఓ వర్గానికి చెందిన కొంత మందికి ముప్పై యేళ్ల క్రితం ఓ సర్వేనెంబరులో పట్టాలు అందించి హద్దులు చూపడం మరిచారు. ఈనేపథ్యంలో దాదాపు 80 ఎకరాలు అసైన్డ్ భూమిలో ఓ వర్గం సాగు చేస్తుండగా అది ఉరదరికీ ఉపయోగపడే స్థలమని అందులో ఐకేపి సెంటర్ నిర్వహిస్తున్నామని మరో చోట సాగు చేసుకోవాలని గ్రామస్థులు సూచించారు. అయినా అందులో పంటసాగు చేయడంతో గ్రామస్థులు ట్రాక్టర్లతో పంటను తొలగించే యత్నం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు స్థలాన్ని గ్రామానికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన రహదారిపై భైఠాయించారు. సిద్దిపేట-కామారెడ్డి ప్రధాన రహదారిని స్తంభింపజేశారు. ఆందోళన జరుగకుండా కలెక్టర్ సందీప్ కుమర్ ఆదేశాల మేరకు బీఎన్.ఎస్.సెక్షన్ 163(144 సెక్షన్) వర్తింపజేయాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో తలెత్తుతున్న సమస్య పరిష్కారం కాకపోవడంతో తహసీల్దార్‌ను హుటాహుటిన కలెక్టరేట్ కార్యాలయానికి బదిలీ చేశారు. తహసీల్దార్‌గా రాంచంద్రంకు బాధ్యతలను అప్పగించారు. శాంత్రిభద్రతల రక్షణకు సీఐ మొగిలి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

పెళ్లి కుదరడం లేదని ఇటీవల ఆత్మహత్యాయత్నం

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెళ్లి సంబంధాలు కుదరడం లేదనే మనస్థాపంలో కొద్దిరోజుల క్రితం పురుగుల మందు తాగిన జిన్నా శ్రావణి(22) అనే యువతి మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.


శ్రావణి

మెట్‌పల్లి మండలం కొండ్రికర్ల గ్రామానికి చెందిన జిన్నా అం తయ్యకు ఇద్దరు కుమారులతో పాటు కూ తురు జిన్నా శ్రావణి ఉన్నారు. శ్రావణికి పెళ్లి సంబంధాలు కుదరడం లేదని ఈనెల 5న పురుగుల మందు తాగింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందు తున్న జిన్నా శ్రావణి మంగళవారం మృతి చెందిందని గ్రామస్థులు తెలిపారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన సంభ మల్లేష్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన కాసనబాద కవిత అనే మహిళను చంపుతానని బెదిరించినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఇరు కుటుంబాలకు కొన్ని రోజులుగా గొడవలు జరుగుతు న్నట్లు ఎస్సై తెలిపారు. ఈ క్రమంలోనే మంగళవారం కవిత ఇంటి ముందుకు మల్లేష్ వచ్చి నానా బూతులు తిడుతూ కత్తి పట్టుకొని చంపుతానని బెది రింపులకు పాల్పడ్డట్లు తెలిపారు. బాధితురాలు కవిత ఫిర్యాదు మేరకు మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండ లం తాటిపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంగారాం (56) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. గంగారాం వ్యవసాయ పనులు ముగించుకొని సైకిల్‌పై తిరిగి తన స్వగ్రామం తాటిప ల్లికి వస్తున్న క్రమంలో ద్విచక్ర వాహ నంపై వస్తున్న జగిత్యాలకు చెందిన మహేష్ అనే వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన గంగారాంను జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గంగారాం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

దిద్దుబాటు చర్యలేవి..?

- కొండగట్టు ప్రమాదానికి రేపటితో ఏడేళ్లు
- బస్సు లోయలో పడి 67 మంది మృతి
- ప్రతిపాదనలకే పరిమితమైన నూతన ఘాట్‌రోడ్డు




కొండగట్టు లోయలో పడిన బస్సు(ఫైల్)

మల్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం కొండగట్టులో 2018లో బస్సు బోల్తా పడి ఘోర ప్రమాదం జరిగినా ఇప్పటికీ ఘాట్‌రోడ్డు దగ్గర అధికారులు ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. ఘాట్‌రోడ్డు అలైన్‌మెంట్ సరిగా లేదని నిపుణులు పదిహేను ఏళ్లగా సూచిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో 2018 సెప్టెంబరు 11న కొండగట్టు గుట్టపై నుంచి ఆర్టీసీ బస్సు దిగుతుండగా లోయలో పడి 67 మంది ప్రాణాలు కోల్పోగా 45మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం అనంతరం కొన్నాళ్ల పాటు ఘాట్ రోడ్డును మూసి వేసి వాహనాల రాకపోకలను నిషేధించారు. ఘాట్‌రోడ్డుకు కొంతమేర మరమ్మతులు, కొన్ని చోట్ల రక్షణ గోడల నిర్మాణం,


కొండగట్టు ఘాట్‌రోడ్డు

స్పీడ్‌బ్రేకర్ల మరమ్మతులు మాత్రమే చేపట్టారు. కానీ శాశ్వతంగా ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలు శూన్యం. గతంలోనూ ఈ ఘాట్ రోడ్డుపై జరిగిన వివిధ ప్రమాదాల్లో ఇప్పటి వరకు 150మందికి పైగానే భక్తులు మృతిచెందారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలను, క్షతగ్రాతులను ప్రత్యేక ప్యాకేజీ ద్వారా ఆదుకోవాల్సి ఉండగా సాయం కోసం నేటికీ బాధితులు ఎదురుచూస్తూనే ఉన్నారు.

ఘాట్‌రోడ్డు మరమ్మతులకే పరిమితం

గతంలో జరిగిన ప్రమాదాలు దృష్ట్యా కొన్నేళ్ల క్రితం మరో ఘాట్‌రోడ్డు కోసం ఆర్‌అండ్‌బీ అధికారులు ఓ కన్సల్టెన్సీ సంస్థతో సర్వే చేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ఘాట్ రోడ్డు 1.2 కి.మీ. ఉండగా నిబంధనల మేరకు మలుపులతో కూడుకొని 2.5 కిమీ. ఉంటేనే రాకపోకలకు అనుకూలమని ఇంజనీరింగ్ అధికారులు తెలపడంతో కొత్త రోడ్డుకు 3.6 కి.మీల మేర సర్వే చేశారు.

అయితే ఘాట్‌రోడ్డు మాత్రమే కాకుండా అదనంగా దొంగల మర్రి నుంచి జేఎన్టీయూ మీదుగా కొండపైకి భక్తులు చేరుకోవడానికి ఘాట్‌రోడ్డు వైజంక్షన్ వరకు 9కి.మీ నాలుగులైన్ల రహదారి ఏర్పాటుకు ప్రతిపాదించారు. ప్రమాదాల నివారణకు, తీసుకోవల్సిన చర్యలపై ఈఈ(ఆర్అండ్‌బీ), జిల్లా రవాణా అధికారి, డీఎస్పీలతో ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ సూచనల మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఈ ప్రతిపాదనలా అటకెక్కాయి.

రాణా ముందే ఆర్టీసీ బస్సు..

ఘాట్‌రోడ్డుపై జరిగిన ప్రమాదంలో 67మంది మృతికి కారణమైన ఆర్టీసీ బస్సు మల్యాల పోలీస్‌స్టేషన్ ముందు అలాగే ఉంది. ప్రమాదం జరిగాక స్టేషన్‌కు తీసుకురాగా ఇప్పటికీ అలాగే ఉండగా నాటి ప్రమాదానికి సాక్ష్యంగా నిలుస్తోంది. బస్సు పూర్తిగా తుప్పు పట్టిపోయింది. పైగా ఇది వ్యవసాయ భూములకు వెళ్లే మార్గంలో ఉండడంతో బస్సును అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు, రైతులు పోలీసులను కోరుతున్నారు.


క్షతగాత్రులను పైకి తీసుకువస్తున్న స్థానికులు(ఫైల్)

ఆగమ శాస్త్రం ప్రకారం

రాజన్న ఆలయ అభివృద్ధి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పనుల పురోగతిపై సమీక్షా సమావేశం

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయాన్ని ఆగమ శాస్త్రం ప్రకారం అభివృద్ధి చేస్తున్నామని ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న ఆలయ సమావేశ మందిరంలో ఆలయ అభివృద్ధి, విస్తరణ పనుల పురోగతిపై మంగళవారం కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, ఈవో రమాదేవితో కలిసి సమీక్షా సమా వేశం నిర్వహించిన అనంతరం దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్రదర్శనం, ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించేలా ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు. రాజన్న ఆలయ విస్తరణ పనులను జూన్ 15వ తేదీన ప్రారంభం చేస్తామని గతంలో తెలి పినట్లుగానే యాదృచ్ఛికం గా అదేరోజు రాజన్న ఆజ్ఞతో పనులు ప్రారంభమయ్యా యన్నారు. శృంగేరి పీఠాధి పతుల సూచనలతో రాజన్న ఆలయాన్ని విస్తరణ చేపడుతున్నామని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధికి టెండర్లు పిలిచామని, వీటిలో ఆలయ విస్తరణకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడత కింద రూ.76 కోట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. రాజన్న ఆలయంలో శ్రీస్వామివారికి కైంకర్య సేవలు, ఏకాంత, ఇతర సేవలు యథావిధిగా నిరంత రాయంగా కొనసాగుతాయని తెలిపారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు జరిగే సమయంలో భీమేశ్వర ఆలయంలో భక్తులకు దర్శనం ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఈవో రమాదేవి, ఆలయ ఉద్యోగులు

వివరించారు. భీమేశ్వర ఆలయంలో ఇప్పటికే షెడ్స్ పనులు చివరి దశలో ఉన్నాయని, ఫ్లోరింగ్ పనులు త్వరలోనే ప్రారం భం చేసి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న ఆలయ ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విప్‌ను సన్మానించిన ఈవో రమాదేవి..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆల యానికి నూతనంగా సబ్‌స్టేషన్ మంజూరు చేసినం దుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను ఆలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈవో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, గోవిందుల అశోక్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, జయకుమారితో పాటు సూపరింటెండెంట్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లో అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝుళిపించారు. సర్వే నంబరు 459లో అక్ర మ నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామానికి చెందిన సోమ మునీంద్ర ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ అధికారి లక్ష్మయ్య, సిబ్బంది అక్రమ నిర్మాణాలను తొలగించేందకు ప్రయత్నించగా ఒడ్డెర కులస్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు అడ్డుకు న్నారు. పోలీసులు అక్కడకి చేరుకొని ఆందోళనకారులను చెదరగొట్టారు. అక్రమ నిర్మాణాల తొలగింపు, అడ్డుకున్న వారిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు.

ఆర్టీసీ పంచారామాల టూర్

భగత్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): కరీంనగర్-2 డిపో నుంచి పంచారా మాల దర్శనాల కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడిపిస్తున్నట్లు మేనేజర్ ఎం. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ శుక్రవారం కరీంనగర్ బస్టాండ్ నుంచి రాత్రి 10 గంటలకు బస్సు బయల్దేరుతుందని పంచరామాలు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట స్థలాల సందర్శన ఉంటాయని వివరించారు. 15వ తేదీ సోమవారం కరీంనగర్‌కు చేరుకోనున్నట్లు తెలిపారు. ఈ టూర్ కోసం పెద్దలకు రూ.3300, పిల్లలకు రూ. 2500 టికెట్ ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సర్వీస్ నంబరు 88265తో ఆన్‌లైన్ రిజర్వేషన్ చేయించుకోవాలని, వివరాలకు 9398658062, 73382850708 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద

8 గేట్లు పైకి ఎత్తి 25 వేల క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీరు వదలడం మంగళవారం కొనసాగింది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 54,545 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 8 గేట్లు పైకి ఎత్తి 25వేల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరద కాలువకు 19,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 684 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి (మిడ్ మానేరు) ప్రాజెక్టు మంగళవారం 13400 ఇన్‌ఫ్లో కోసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 13400, మానేరు ములవాగు ద్వారా 200 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుంది. కాగా దిగివ ఉన్న ఎల్ఎండీ ప్రాజెక్టుకు నాలుగు గేట్ల ద్వారా 6 వేల క్యూసెక్కులు ప్యాకేజి 10 లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, ప్యాకేజి 9లోని మల్కాపేట రిజర్వాయర్‌కు 900 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.75 ఉండగా, నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.914 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.


అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ లోకి రెండుపంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.19 టీఎంసీల నీరు ఉంది. మధ్య మానేరు ద్వారా వస్తున్న 6400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మల్కపేట రిజర్వాయర్‌లోకి నీటి విడుదల

రెండు పంపులు ఆన్ చేసి నీటిని విడుదల చేసిన అధికారులు

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషిపై హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


నీటిని విడుదల చేసిన అధికారులు

కోనరావుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలోని మల్కపేట రిజర్వాయర్‌లోకి మిడ్ మానేరు నుంచి సుమారు 1.5 టీఎంసీ నీటిని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో అధికారులు మంగళవారం విడుదల చేశారు. దీంతో కోనరావుపేట మండలంలోని వ్యవసాయానికి సాగునీరు అందించవచ్చని అధికారులు తెలుపుతున్నారు. ఖరీఫ్ సీజన్‌తో పాటు రబీ సీజన్‌కు నీరు అందుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మూడు టీఎంసీల సామర్థ్యం గల మల్కపేట రిజర్వాయర్‌కు పూర్తి సామర్థ్యం వరకు నింపాలని ప్రజలు కోరుతున్నారు. ఏమైనా నీటిని విడుదల చేయడం పట్ల మండల రైతులు హర్షం వ్యక్తం చేయడమే కాకుండా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


తిరుపతి

జాతీయ స్థాయి శిక్షణ సదస్సుకు వెన్నుమట్ల ఉపాధ్యాయుడు

గొల్లపల్లి, సెప్టెంరు 9 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలం వెన్నుమట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న తిరుపతి జాతీయ స్థాయి విద్యా సదస్సుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆయన సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్సెస్ అండ్ ట్రైనింగ్) మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, న్యూ ఢిల్లీ వారి ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ 2020) ఓరియేంటేషన్‌కు హాజర య్యారు. ఈ నెల 8 నుంచి 27 వరకు 21 రోజుల పాటు హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పది మంది నిష్ణాతులైన ఉపాధ్యాయులను ఈ సదస్సుకు ఎంపిక చేయగా జగిత్యాల జిల్లా నుంచి తిరుపతి ఎంపికయ్యారు. గత 2021 సంవత్సరంలో ఒకసారి జాతీయ స్థాయి సదస్సులో పాల్గొన్న తిరు పతి మరోసారి అరుదైన ఘనత సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యులు, తోటి ఉపాధ్యాయులు తిరుపతిని అభినందించారు.

శాతవాహనలో లంబాడీ విద్యార్థుల ఆత్మగౌరవ ధర్నా

గణేశ్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనే కుట్రను మానుకోవాలని శాతవాహన యూనివర్సిటీ లంబాడీ విద్యార్థుల ఆధ్వర్యంలో మంగళవారం విద్యాలయం గేటు ఎదుట ఆత్మగౌరవ ధర్నాను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీ జాబితా నుంచి బంజారా లంబాడీ, సుగాలీలను తొలగించాలని సుప్రీం కోర్టులో వేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం ఉప అధ్యక్షుడు భీమసాహెబ్, సంతోష్ నాయక్, ప్రేమ్‌నాయక్, రాహుల్, వంశీ,శంకర్, అరుణ్, మోహన్, శాతవాహన పరిశోధక విద్యార్థి బాదావత్ రంజీత్ నాయక్ పాల్గొన్నారు.


ఎస్‌యూ గేటు ఎదుట ధర్నా చేస్తున్న లంబాడీ విద్యార్థులు

నిరుపేద కుటుంబాలకు అండగా ప్రభుత్వం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


గేదెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

బోయినపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామంలో ఏర్పా టు చేసిన మినీ డెయిరీ(పైలెట్ ప్రాజెక్టు) కింద పాడి గేదెల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్‌తో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులం సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ ద్వారా 19 మంది లబ్ధిదారులకు 38 గేదెలను పంపిణీ చేశామన్నారు. గేదెలు అవసరం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చొప్పదండి ఎమ్మె ల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సమాజంలో అత్యంత వెనుక బడిన దళితులను ఆదుకోవడానికి మంచి విద్య అందించడంతో పాటు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. పేద వర్గాలు చదువుకునే గురుకులాల్లో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మెటిక్ చార్జిలను ప్రభుత్వం పెంచిందని అన్నారు.

గతం కంటే రెట్టింపుగా విదేశీ విద్యకు రేవంత్ సర్కార్ నిధులు విడుదల చేస్తోందని, గత సంవత్సరం 500 మంది వరకు దళిత వర్గాల బిడ్డలకు విదేశాలలో చదువుకునేందుకు 20 లక్షలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం ద్వారా దళిత వర్గాల విద్యార్థులకు మెరుగైన వస్తువులు కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో మానవతా దృక్పథంతో ఆలోచిస్తూ క్షేత్రస్థాయిలో పనిచేసే కలెక్టర్ ఉండటం వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని, ప్రజలకు సేవలు అందిస్తున్న కలెక్టర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. యూరియా సమస్యను చాకచక్యంగా పరిష్కరించడంలో కలెక్టర్ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.

బోయినపల్లిలో దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఒక్కరికి పాడి గేదెలు అందేలా చర్యలు తీసుకుం టామని ఎమ్మెల్యే తెలిపారు. ముందుగా 40మంది లబ్ధి దారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అనం తరం కొదురుపాకలోని పశు వైద్యశాల ఉప కేంద్రాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులకు ఆదేశించారు. అంతకు ముందు కాళోజి జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి రవీందర్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయినిపల్లి ఎల్లేశ్ యాదవ్, వైస్‌చైర్మన్ నిమ్మ వినోద్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జోగినపల్లి వెంకటరామారావు, మండల అధ్యక్షుడు వెన్నెల రమణరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, జంగంఅంజయ్య పాల్గొన్నారు.


ఆలయానికి వెళ్లేందుకు వాగు దాటుతున్న భక్తులు

వరదలకు కొట్టుకుపోయిన బ్రిడ్జి..

అంజన్న ఆలయానికి వెళ్లేందుకు భక్తుల కష్టాలు

గంభీరావుపేట మండలం బీముని మల్లారెడ్డిపేట అంజనేయస్వామి ఆలయానికి వెళ్లే దారిలోని బ్రిడ్జి ఇటీవల వరదలకు కొట్టుకు పోయింది. దీంతో అంజన్న ఆలయానికి వెళ్లే భక్తులు మొకాళ్ల లోతు నీళ్లలో వాగులోంచి వెళుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ మానేరు మత్తడి దూకడంతో లింగన్నపేట వాగు ఉప్పొంగి ఉధృతంగా ప్రవహించింది. వరద ఉధృతితో అంజన్న ఆలయం వద్ద ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయింది. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

- గంభీరావుపేట, ఆంధ్రజ్యోతి


అంజన్న ఆలయం వద్ద కొట్టుకుపోయిన బ్రిడ్జి

ఎస్పీకి సన్మానం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) :గణేష్ నవ రాత్రులతో పాటు నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించేలా కృషి చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను మంగళ వారం జగిత్యాల వీహెచ్‌పీ నాయకులు సన్మానించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భద్రతా కల్పించిన డీఎస్పీ రఘచందర్, సీఐ కరుణాకర్, ఎస్సైలు కుమారస్వామి, రవికిరణ్, సుప్రి య, మల్లేశంను సన్మానించారు.

కార్యక్రమంలో ఉత్సవ సమితి నాయకులు పద్మాకర్, అరుణ్, పరం ధాములు, రాములు, సంతోష్, మహేందర్, శ్రీనివాస్, సుధాకర్, కిషోర్ సింగ్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఈ నెల 21 నుంచి 28 వరకు నిర్వహించ నున్న జగిత్యాల క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోస్టర్‌ను ఎస్పీ ఆవిష్కరించారు. క్రీడాకారు లు యాకుబోద్దీన్, కాంత్రి తదితరులు ఉన్నారు.

సమష్టి కృషితో విజయం

కోరుట్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వివిధ శాఖల అధికారుల సమష్టి కృషితో గణేష్ నిమజ్జనోత్సవంతో పాటు వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాలను విజయ వంతం చేసినట్లు తహసీల్దార్ కృష్ణ చైతన్య, మున్సిపల్ కమిషనర్ రవీందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రవీందర్ ఆధ్వ ర్యంలో వివిధశాఖల అధికారులతో విజయో త్సవం నిర్వహించి తహసీల్దార్ కృష్ణ చైతన్యతో కలిసి సన్మానించారు. ఈ కార్యక్ర మంలో మండల విద్యాధికారి నరేశం, ఎస్ ఐ చిరంజీవి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండల ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక

గొల్లపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలంలో పదిమంది ఉపాధ్యా యులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై నట్లు ఇన్‌చార్జి ఎంఈవో చెరుకు రాజన్న మంగళవారం తెలిపారు. సెప్టెంబరు 5 జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు పేర్కొన్నారు. జి. లక్ష్మీబాయి (చిల్వాకోడూ ర్), ఎ.అనిత (మల్లన్నపేట), బి. స్వర్ణకుమారి (గొల్లపల్లి), ఎం.ఎ. రషీద్ (శ్రీరాముల పల్లె), బి. రాజేంధర్ (గొల్లపల్లి మోడల్ స్కూల్), వి. శైలజ (కేజీబీవీ), డి. చంద్రిక (గొల్లపల్లి, ఒ.సీ), టి. కుమార స్వామి (లొత్తునూర్), టి. సుప్రజ (గోవిందు పల్లె), పి. రంజిత్ కుమార్ (చెందోళి) ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపికైనట్లు ఎంఈవో తెలిపారు.

ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులకు బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సన్మానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయ వంతం చేయాలని ఈ సందర్భంగా ఎంఈవో చెరుకు రాజన్న కోరారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు విద్యార్థులకు వరం

● ప్రతిభ కనబరచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక ● రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ● క్రీడా కోటాలో ఉద్యోగాలకు అవకాశం



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

వెల్గటూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం లాంటివి. ఈ క్రీడల ద్వారా వెలుగులోకి వచ్చిన పలువురు విద్యార్థులు జాతీయ స్థాయిలో మెరిశారు. ఈ ఏడాది ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో గ్రామాల్లో క్రీడా పండగ మొదలైంది. ఇప్పటికే మండల స్థాయిలో జిల్లా స్థాయి ఎంపిక పోటీల ప్రక్రియ కొనసాగుతోంది. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల తేదీలు ఖరారు కావడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది. కాగా జిల్లా స్థాయిలో ఈ నెల 16 నుంచి 19 వరకు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

● పీఈటీలు కరువు

ఎక్కువ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు మంజూరు లేక పోవడంతో ఉత్సాహం ఉన్నా ప్రోత్సాహం కరువవడంతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ ప్రపంచానికి తెలియడం లేదు. గ్రామీణ ప్రాంత బాల బాలికలకు న్యాయం జరిగేలా వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాల్సిన అవ సరం ఎంతైనా ఉంది. కాగా ఎస్‌జీఎఫ్ మండల, జిల్లా స్థాయి ఎంపికలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్ 14, అండర్ 17 విభాగాలలో బాల బాలికలకు వేరు వేరుగా మండల, జిల్లా స్థాయి అనంతరం ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. తద్వారా బాల బాలికలకు భవిష్యత్తులో విద్య, ఉద్యోగాలలో క్రీడా కోటాలో లబ్ధి పొందే అవకాశం ఉంటుంది.

● 20 అంశాల్లో క్రీడా పోటీలు..

మండలస్థాయిలో కబడ్డీ, ఖో ఖో, వాలీ బాల్, అథ్లెటిక్స్ క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో కబడ్డీ, ఖో ఖో, వాలీ బీల్, అథ్లెటిక్స్ తో పాటు బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, హ్యాండ్బాల్, క్రికెట్, సాఫ్ట్ బాల్, టెన్నిస్, హాకీ, యోగా, ఆర్చరీ, బాక్సింగ్, నెట్ బాల్, రగ్బీ, చెస్, తైక్వాండో, కరాటే, జూడో వంటి క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహిం చనున్నారు. ఆయా క్రీడా అంశాల్లో ప్రతిభ కనబరిచిన క్రీడా కారులను రాష్ట్ర స్థాయి పోటీల కు ఎంపిక చేయనున్నారు.

● ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తాం

- చక్రధర్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక పారదర్శకంగా నిర్వహిస్తాం. మండల స్థాయిలో ఖో ఖో, కబడ్డీ, వాలీ బాల్, అథ్లెటిక్స్ నిర్వహిస్తాం. మిగతా క్రీడా అంశాల్లో నేరుగా జిల్లా స్థాయి, ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎంపికలు ఉంటాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తాం.

రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి



మంత్రి అడ్లూరికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల ప్రజలు నివాసమున్న ప్రాంతాల్లో రహదారులు, భవనాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ వినతిపత్రం అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కలిసి పరిస్థితిని వివరించారు. రోడ్లు, సంఘ భవనాల అభివృద్ధికి, ఎస్టీ మైనార్టీ గురుకులాలు, ఎస్సీ, ఎస్టీ తండాల్లో పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మౌళిక సదుపాయల కల్పనకు నిదులు మంజూరు చేయాలని వినతిచేశారు. ఇందుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

కోరుట్ల, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని కల్లూర్ రోడ్డులోని కళాశాల నుండి విద్యార్థులు బారీ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీ పట్టణంలో కల్లూర్ రోడ్డు నుండి జాతీయ రహదారి మీదుగా కార్గిల్, నందీ చౌరస్తా వద్ద నుండి ఆర్‌డీఓ కార్యలయం వరకు సాగింది. ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఆర్‌డీఓ కార్యాలయ ఏఓ రాజమణికి వినతి ప్రతంను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడారు. విద్యార్థులకు అందవలసిన ఉపకార వేతనాలు ప్రభుత్వ చెల్లిచడంలో జాప్యం చేయ్యడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** ఫీజు రీయెంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ ధర్మపురి మండల కేంద్రంలోని శ్రీ చైతన్య, నవోదయ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళ వారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ గత మూడు ఏళ్ల నుండి విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లను చెల్లించక పోవడం విచారకరమని అన్నారు. అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయంలో విద్యా ర్థులు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లింగమూర్తి, అధ్యా పకులు వడుకాపురం మహేష్, బీజేపీ సీనియర్ నాయ కులు పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ధర్మపురి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 26 మంది ఉత్తమ ఉపాధ్యాయులను తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సీతాలక్ష్మి, మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గజభీంకార్ గోవర్ధన్, కాశెట్టి రమేష్, గాదె శ్రీనివాస్, .కాశెట్టి శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కొలిచాల శ్రీనివాస్, ఒడ్నాల శ్రీనివాస్‌రావు, ప్రభాకర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను ఎంఈఓ లోకిని శ్రీనివాస్ సన్మానించారు.కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు అర్జున్, కిషన్‌రావు, సీఆర్‌పీలు, సిబ్బంది ఉన్నారు.

టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలి

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలు దేవస్థానాలను కలుపుతూ ప్రత్యేక టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలని ఎక్సయిజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మెట్‌పల్లికి చెందిన నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు ఎండీ అవేజ్ వినతిపత్రం అందించారు. మంగళ వారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి సమస్యను విన్నవిం చారు. ఇందుకు స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు సాధ్యాసాధ్యాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని టూరిజం శాఖ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించినట్లు నిర్మల్ టీపీసీసీ పరిశీలకులు, సిరిసిల్ల జిల్లా పీసీసీ కోఆర్డినేటర్ ఎండీ అవేజ్ తెలిపారు.

అంగన్‌వాడీల్లో కూరగాయల సాగు

(5వ పేజీ తరువాయి)

ఎలా నిర్వహించాలి అనే విషయాలపై టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ నిధులతో విత్తనాలు, కుండీలు, మట్టి ఇతరపనిముట్లు కొనుగోలుకు వినియో గించాల్సి ఉంటుంది. ఐదేళ్ల పాటు కిచెన్ గార్డెన్లను నిర్వహించాల్సి ఉంది. అయి తే ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే పటిష్ట పర్యవేక్షణ అవసరమని తల్లిదండ్రులు అభిప్రాయ పడుతున్నారు.

● విత్తనాలు సరఫరా..

కూరగాయలు, ఆకుకూరల పెంపకానికి పక్కా అంగన్‌వాడీ భవనాలు, సొంత స్థలాలు, నీటిసరఫరా, ప్రహరీ ఉన్న కేంద్రాలను ఎంపిక చేశారు. ప్రతి కేంద్రానికి టమాట, బెండకాయ, వంకాయతో పాటు ఆకుకూరల సాగుకు అవసరమైన విత్తన పాకెట్లను కూడా ప్రభుత్వం సరఫరా చేసింది. దీనికి సంబంధించిన డబ్బులు సంవత్సరానికి రూ.500 చొప్పున చెల్లిస్తారు. సంవత్సరానికి రూ. వెయ్యి నిర్వహణకు అందజేస్తారు.

'బంజారాల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ మహారాజ్'

మల్లాపూర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అని ధర్మ గురువు ఆడే ప్రేమ్ మహారాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని సిర్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోగ్ బండర్, ప్రాణ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో సిర్పూర్ మాజీ సర్పంచ్, అల్ ఇండియా బంజార సేవా సంగ్ జిల్లా నాయకులు భూక్యా గోవింద్‌నాయక్, నునవత్ రాజు, ధర్మనాయక్, నునవత్ గోవింద్‌నాయక్ పాల్గొన్నారు.

హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి

-ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ అయినపాఠశాలలకు వెంటనే జీహెచ్‌ఎం గ్రేడ్-2 పోస్టు మంజూరు చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) జిల్లా శాఖ ప్రభుత్వాన్ని కోరినట్లు జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్, ప్రధాన కార్యదర్శి భైరం హరికిరణ్ తెలిపారు. ఎస్టీయూ రాష్ట్ర సంఘం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి పాఠశాలలు సుమారు 300ల వరకు ఉన్నాయని, జగిత్యాల జిల్లాలో 11 పాఠశాలలు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. అలాంటి పాఠశాలలకు అన్ని సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కూడా మంజూరు చేయాలని వారు వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అనుమతి కోసం ప్రతిపాదనలు పంపనున్నట్లు పాఠశాల విద్యాసంచాలకులు హామి ఇచ్చినట్లు వారు జిల్లా శాఖ పక్షాన వివరించారు.

పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేందర్, కార్యదర్శిగా వరుణ్‌కుమార్, అడ్వైజర్‌గా సదాశివరెడ్డి, కోశాధికారిగా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రంజిత్, లేడీ రిప్రజెంటేటివ్‌గా మౌనిక ఎన్నికవగా, జగిత్యాల డివిజన్ కార్యదర్శిగా శ్రీధర్, కోశాధికారిగా మహేష్, సెంట్రల్ డివిజన్ సెక్రెటరీగా శ్రీనాథ్, కోశాధికారిగా మహేంధర్, మెట్‌పల్లి డివిజన్ కార్యదర్శిగా నవీన్, కోశాధికారిగా సంతోష్ ఎన్నికయ్యారు. అనంతరం తెలంగాణ పవర్ డిప్లమా ఇంజనీర్స్ కంపెనీ జనరల్ సెక్రెటరీ సుబ్రమణ్యేశ్వర్‌రావు మాట్లాడుతూ వినియోగదారుల సేవలకు, విద్యుత్ సంస్థ ప్రగతిలో యువ ఇంజనీయర్లదే కీలకపాత్ర అన్నారు. నిబద్ధతతో పనిచేస్తూ, సంస్థ అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డిప్యూటీ సెక్రెటరీ మల్లిఖార్జున్, సహాయ కార్యదర్శి అనిల్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంధర్, మనోహర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీపీగెట్‌లో జగిత్యాల విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమోద్ కుమార్

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్)కు చెందిన విద్యార్థిని సయ్యద్ ఫలక్ సీపీగెట్- 2025 (కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్)లో రాష్ట్రస్థాయి నాలుగో ర్యాంకు సాధించింది. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో విద్యార్థిని సయ్యద్ ఫలక్ ప్రతిభ కనబరిచింది. హిందీ విభాగానికి చెందిన సయ్యద్ ఫలక్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. హిందీ కోర్సు ప్రవేశానికి అర్హత సాధించింది. ప్రతిభ కనబరచిన సయ్యద్ ఫలక్‌ను కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్‌తో పాటు పలువురు అధ్యాపకులు అభినందించారు. ఈసందర్భంగా ఇంచార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ వేసవి కాలంలో కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ కోచింగ్ అందించడంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలిగారన్నారు.

కాలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

-పట్టించుకోని అధికారులు -ఇబ్బందులు పడుతున్న రైతులు



లింగాపూర్‌లో శివారులో కాలిన ట్రాన్స్‌ఫార్మర్

పెగడపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని బతికపల్లి అను బంధ గ్రామమైన కొండయ్య పల్లి, లింగాపూర్ గ్రామాల శివా రులో గల ఎస్.ఎస్ 79 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వారం రోజుల క్రితం కాలి పోయింది. మోటార్లు నడవకపోవడంతో పంటలు ఎండిపోతుండగా సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని, ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులో ఉంటే సమాచారం ఇస్తాం వెళ్లి తీసుకుని రండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని రైతులు ఆవేదన వెలిబుచ్చారు. వారం రోజులుగా పొలాలకు నీరు పెట్టక పంటపొలాలు బీటలు వారి పొలాలు ఎండుతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్ బిగించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

'బీఆర్ఎస్ గెలుపే ధ్యేయంగా పని చేయాలి'

పెగడపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పని చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లోక మల్లారెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని రాములపల్లిలో మంగళవారం పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, పార్టీ జండా ఆవిష్కరించారు.

'నగదు బదిలీతోనే మత్స్యకారులకు లబ్ధి'

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మత్స్యకారులకు చేప పిల్లలకు బదులుగా నగదు పంపిణీ చేస్తేనే లబ్ధి చేకూరుతుందని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. మత్స్యకార సొసైటీలకు నగదు పంపిణీ చేయడం వలన చేప పిల్లల పంపిణీలో అక్రమాలకు తావులేకుండా ఉంటుందని లేఖలో జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ధర్మపురి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హైదారాబాద్‌లో న్యాయవాది బండారు సురేష్‌బాబుపై కొంత మంది వ్యక్తులు దాడి చేసినందుకు నిరసనగా మంగళవారం ధర్మపురి పట్టణంలోని న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అలుక వినోద్‌కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో న్యాయవాది బండారు సురేష్‌బాబుపై జరిగిన జరిగిన దాడిని న్యాయవాదులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బందెల రమేష్, మాజీ అధ్యక్షులు రౌతు రాజేష్, ఏజీపీ ఇమ్మడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెలమ సంఘం సభ్యుల సంక్షేమానికి కృషి

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెలమ సంఘ సభ్యుల సంక్షేమానికి అవసరమైన కృషి చేస్తున్నామని జగిత్యాల వెలమ సంక్షేమ మండలి అధ్యక్షుడు అయిల్నేని సాగర్ రావు, ప్రధాన కార్యదర్శి దన్నపునేని వేణు గోపాల్ రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని వెలమ సంక్షేమ సంఘ భవనంలో పలువురు బాధిత కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా చెక్కులు, ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన గండ్ర వంశీధర్ రావు కుటుంబ సభ్యులకు రూ. లక్ష ప్రమాద బీమా చెక్కును అందించారు. కార్యక్రమంలో జగిత్యాల వెలమ సంక్షేమ మండలి నాయకులు బండారి దివాకర్, కమలాకర్ రావు, రవీందర్ రావు, ప్రశాంత్, సురేందర్, అనిల్, అజయ్, ప్రవీన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

ధర్మపురి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల కేంద్రంలోని మైనార్టీ బాలికల రెసిడెన్సియల్ స్కూల్‌కు చెందిన ఆర్. జ్యోతి మండల ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ధర్మపురి మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఎంఈవో సీతాలక్ష్మి కలిసి ఆమెను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమెను ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

కాళోజీ నారాయణరావుకు ఘన నివాళి



రాయికల్‌లో కాళోజీ చిత్రపటానికి నివాళి

రాయికల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా రాయి కల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు పండితుడు చెరుకు మహేశ్వర శర్మ, ఆర్‌పీలు సతీష్, రాజేందర్, నరేష్, ప్రధానోపాధ్యాయులు లక్షా మ్రెడ్డి, కిరణ్ కుమార్, శ్రీనివాస్, దేవలక్ష్మి, స్నేహలత, పద్మ, గంగరాజం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్ మండలంలోని ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో కాళోజీ నారాయణ రావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాష దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలోవిద్యార్థులకు తెలంగాణ భాష గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలె శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్ పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్, డైరెక్టర్‌లు మచ్చ లలిత, విద్యాన్వేష్ పాల్గొన్నారు.

●మండలంలోని మైతాపూర్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉప న్యాస పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తెలుగు ఉపాధ్యాయుడు సిద్దె గంగరాజంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ముక్కాల మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** మండలంలోని మేడిపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ భాష దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మండల కేంద్రంలోని కేజీబీవితో పాటు ఆయా పాఠశాలల్లో మంగళవారం కాళోజి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ కె. వేణు, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ బండ్ల భాస్కర్, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

●**ఇబ్రహీంపట్నం:** కాళోజీ జయంతి వేడుకలను మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ వరప్రసాద్ కాళోజీ చిత్రపటానికి నివా ళులు అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్, ఆర్‌ఐలు రేవంత్, భూమేష్, మంగ్యానాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మీ నరసింహారావు

భీమారం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజ లను మోసం చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. మంగళవారం భీమారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గెలిచి 21 నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ లను నెరవేర్చడంలో విఫలమవుతున్నారని అన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మండలంలోని రాగోజీపేటకు చెందిన పిట్టల లక్ష్మీరాజన్నకు ప్రమాదవశాత్తు చేయి విరుగగా, జాలి చిన్న రాజన్న కాలుకు శస్త్ర చికిత్స చేయించుకోగా వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జోగనిపల్లి సుజిత్‌రావు తండ్రి రాజేశ్వర్ రావు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

●**కథలాపూర్:** మండలంలోని తక్కళ్ళపల్లి బీఆర్ఎస్ గ్రామ మాజీ అధ్యక్షుడు పోచంపల్లి నర్సయ్య తండ్రి ఇటీవల మరణించగా ఆ కుటుంబాన్ని మంగళవారం చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించారు. కార్యక్ర మంలో మాజీ సర్పంచ్ మేడిపల్లి సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, కోట లక్ష్మీనరసయ్య ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

రాయికల్, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): రాయికల్ పట్టణ అభివృద్ధి కోసం విడుదలైన నిధుల ద్వారా ప్రజల కు ఉపయోగమైన పనులు చేపట్టాలని రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనో హర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. సమస్యలు పరిష్కరించి సీసీ రోడ్లు, మురికి కాలువలు, నిర్మించా లని, స్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని వారు కోరారు.

రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గం

రాయికల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యో తి): రాయికల్ మండలంలో రిటైర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని మంగళ వారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుని గా తిరుకోవెల వెంకటనర్సయ్య, అధ్యక్షు నిగా ఏనుగు రాజరెడ్డి, ప్రధాన కార్యద ర్శిగా బత్తిని నిరంజన్‌లు ఎన్నికయ్యారు. అలాగే కోశాధికారిగా సింగని రాందాస్, అసోసియేషన్ అధ్యక్షునిగా సిలివేరి ఆశన్న, ఉపాధ్యక్షులుగా కడార్ల లక్ష్మీనర్స య్య, రాములు, నిర్వహణ కార్యదర్శుగా శ్రీనివాస రావు, ఆకు నర్సయ్య, ప్రచార కార్యదర్శిగా చిలివేరి నర్సయ్యను ఎన్నుకున్నారు.

రెడ్కో చైర్మన్‌కు సన్మానం

జగిత్యాల, సెప్టెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల రెడ్కో చైర్మన్‌గా బాధ్య తలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ శరత్‌ను మంగళవారం జగిత్యాల జిల్లా ట్రైసా అధ్యక్షుడు ఎండీ వకీలు ఘనంగా సన్మానించారు.

వేంపేట మాజీ సర్పంచ్ మృతి

మెట్‌పల్లిరూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీజేపీ సీనియర్ నాయకుడు మారంపల్లి శ్రీనివాస్(52) తిరుమలలో గుండెపోటుతో మృతిచెందారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల బీజేపీ నాయకులు సంతాపం తెలిపారు.

12న క్యాన్సర్ శిబిరం

మల్యాల,సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రామపంచాయితీ ఆవరణలో శుక్రవారం ఉచిత మెగా క్యాన్సర్ శిబిరం నిర్వహించనున్నట్లు పంచాయితీ ఈవో శ్రీకాంత్ తెలిపారు. క్యాన్సర్ నిర్ధారణ, ఎక్స్‌రే, మామొగ్రఫీ పరీక్షలు చేయబడుతాయని కోరారు.